క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓలే కీలకం



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రవిశంకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: ఎన్నికల నిర్వహణలో బీఎల్ఓలే (బూత్ లెవల్ ఆఫీసర్) కీలకమని ఈఆర్‌ఓ రవిశంకర్‌రెడ్డి అన్నారు. జాతీయస్థాయి బీఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం జరిగిన శిక్షణకు ఈఆర్‌ఓ హాజరై మాట్లాడారు. స్థానిక డ్వామా హాల్‌లో బుధవారం బొమ్మనహాళ్ మండలానికి చెందిన 50 మంది బీఎల్‌ఓలు శిక్షణకు హాజరయ్యారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 తోపాటు ఇతర మార్పులు, చేర్పులపై అన్ని రకాలుగా అవగాహన పెంచుకునేలా శిక్షణలో నేర్చుకోవాలన్నారు. ఈ నెల 16న నిర్వహించే శిక్షణకు బీఎల్ఓలు కచ్చితంగా హాజరుకావాలన్నారు. పారదర్శక జాబితా, ఓటర్లలో విశ్వాసం పెంపొందించేందుకు ఓటర్ల జాబితా తయారీ కోసం బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎన్నికల డీటీ సుజాత, మాస్టర్ ట్రైనర్ వెంకటరమేష్ పాల్గొన్నారు.

జిప్సం వేస్తే అధిక దిగుబడులు



కమ్మూరులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

కూడేరు: వేరుశనగ పంట పూత దశలో ఉన్నప్పుడు జిప్సం వేస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి శుభకర్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కమ్మూరు, అరవకూరు గ్రామాల్లో అధికారులు 'పొలం పిలుస్తోంది కార్యక్రమం' నిర్వహించారు. బోరుబావుల కింద వేసిన వేరుశనగ, స్వల్పంగా కురిసిన వర్షానికి సాగైన కంది, ఆముదం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. పంటల సాగులో మెలకువలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తింపునకు సంబంధించి జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో పొందుపరిచామన్నారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేకపోతే అర్జీలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఓ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కణేకల్లు: యాజమాన్య పద్ధతులతోనే మేలైన దిగుబడి సాధ్యమని రాయదుర్గం ఏడీఏ ఎస్. పద్మజ సూచించారు. మండలంలోని ఎన్.హనుమాపురం, హనకనహాళ్‌లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఏడీఏ, ఏఓ జగదీష్ వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, కంది విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ రవికుమార్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని బుధవారం డీసీహెచ్ఎస్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందికి మెమో ఇచ్చారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న భారతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పీవీఆర్ స్కూల్ పక్కన ప్రమాదకరంగా డ్రైనేజీ



బళ్లారి రోడ్డులో రక్షణ గోడ లేని మురుగు కాలువ

ఆదమరిస్తే.. అంతే సంగతులు!

- కల్వర్టు, డ్రైనేజీలపై రక్షణ చర్యలు శూన్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

రాయదుర్గంటౌన్: కల్వర్టుల అంచులు, ఓపెన్ డ్రైనేజీలు ప్రమాదకరంగా మారాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రజలు, వాహనదారులు ప్రమాదం కొనితెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలోని పలుచోట్ల ఇలాంటి డ్రైనేజీలు, కల్వర్టులు దర్శనమిస్తాయి. లక్షలాది రూపాయలతో డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నా సైడ్ వాల్స్ వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ప్రాణాలతో చెలగాటమాడడం ఎంతవరకు భావ్యమని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. రాజ విద్యాశ్రమం ఎదురుగా బళ్లారి రోడ్డు ప్రధాన కల్వర్టు వద్ద కాలువ ప్రమాదకరంగా ఉంది. కాలువపై ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో ఓసారి ట్రాక్టర్ సైతం డ్రైనేజీలో కూరుకుపోయింది. అలాగే కొలిమి వీధి నుంచి రామస్వామి వీధి టర్నింగ్ పాయింట్‌లో డ్రైనేజీపై ఎలాంటి రక్షణ చర్యలు లేవు. కేబీ ప్యాలెస్ రోడ్డులోని పీవీఆర్ స్కూల్ పక్కన డ్రైనేజీ ప్రమాదకరంగా ఉంది. విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఓబుళాచారి రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో కల్వర్టు పక్కన కాలువపై కూడా రక్షణ గోడ లేదు. ఆయా మార్గాల్లో నిత్యం వందలాది వాహనాల రాకపోకలు ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలపై రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



కొలిమివీధి టర్నింగ్‌లో నోరు తెరచిన డ్రైనేజీ



వేంకటేశ్వర జూనియర్ కళాశాల పక్కన ఇలా..

న్యాయమూర్తిపై ట్రోలింగ్ దారుణం



రాయదుర్గంలోని కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గంటౌన్: సోషల్ మీడియా వేదికగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని ట్రోల్ చేయడాన్ని రాయదుర్గం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. న్యాయవాదుల జిల్లా అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తూ న్యాయమూర్తిపై ట్రోలింగ్‌కు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లేశప్ప, వన్నూరుస్వామి మాట్లాడారు. పలు కేసుల్లో ఉత్తర్వులు వెలువరించిన అనంతరం న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని న్యాయ వ్యవస్థను దిగజార్చేలా ట్రోలింగ్ చేయడం దారుణమన్నారు. దీన్ని న్యాయ వ్యవస్థపై ప్రత్యక్ష దాడిగా భావిస్తున్నామన్నారు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులపై అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవిచంద్ర, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు జగన్‌మోహన్‌రెడ్డి, రాజారావు, నరసింహారావు, జాన్సన్, లోకానంద, రఘు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

11న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయదుర్గం: పట్టణ సమీపంలోని మద్దానేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు రాయదుర్గం నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో .. బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ' పై క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. చంద్రబాబు మోసాల్ని ఇంటింటా వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గంలోని రాష్ట్ర ప్రధాన, సహాయ, వివిధ విభాగాల కార్యదర్శులు, జిల్లా కమిటీల్లోని సభ్యులు, పట్టణ, మండల కన్వీనర్లు, అన్ని విభాగాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



గోపిని పరామర్శిస్తున్న తలారి రంగయ్య, ఉమా

బ్రహ్మసముద్రం: టీడీపీ నేతలకు దాడులకు భయపడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు గోపి, కార్యకర్త బాలకృష్ణకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య, సీనియర్ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు భరోసా కల్పించారు. టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన గోపి, బాలకృష్ణ బుధవారం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, సీనియర్ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌తో కలిసి ఆస్పత్రికి చేరుకుని వారిని పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నేతల ఆగడాలకు బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయని అధైర్యపడొద్దని ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శి గోపాల్‌రెడ్డి, జిన్నా మల్లి, వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'కూటమి' మోసాలను ఇంటింటా వివరించండి



కుందుర్పిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



కంబదూరులో మాట్లాడుతున్న తలారి రంగయ్య

- నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య

కుందుర్పి: కూటమి ప్రభుత్వం మోసాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎంపీ తలారి రంగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కన్వీనర్ హనుమంతరాయుడి వ్యవసాయ క్షేత్రంలో కన్వీనర్ అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర్‌నాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా సమన్వయకర్త రంగయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. ప్రజలకు సేవచేయాలని ఉద్దేశంతోనే గ్రూప్ వన్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

ఈస్టాంపుల కేసును పక్కదారి పట్టించేందుకే..

కళ్యాణదుర్గంలో సంచలనం రేపిన ఈస్టాంపుల కేసును పక్కదారి పట్టించేందుకే స్థానిక ఎమ్మెల్యే బీటీపీ పనులను ప్రారంభించామంటూ కొత్త నాటకానికి తెరలేపారని మాజీ ఎంపీ విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు వస్తోందన్న అక్కసుతోనే 2018 నుంచి బీటీపీ పనులను అప్పట్లో కాంట్రాక్టర్‌గా ఉన్న సురేంద్రబాబు ఆపేశారన్నారు. ఇప్పుడు బీటీపీ పనులు పూర్తి చేస్తామంటూ మరోసారి నియోజకవర్గ ప్రజలను టీడీపీ నాయకులు మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏడాదిలోనే రూ.800 కోట్లు ఎమ్మెల్యే తన సొంత డబ్బు ఖర్చు చేసినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో జిల్లా కేంద్రంలో కాంట్రాక్టర్‌గా రూ.కోట్లు దండుకొన్న ఎమ్మెల్యే అదే జగన్ ఫొటోపై పగబట్టడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులకు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులపై ఉన్న శ్రద్ధ ఢిల్లీకి వెళ్లి సంస్థ రెన్యూవల్ విషయంలో ఎందుకు చూపకూడదని ప్రశ్నించారు. లాయర్ హనుమంతరెడ్డి, ఎంపీపీ కలమలా నాగరాజు, దొడగట్ట నారాయణ, మాజీ వాల్మీకి డైరెక్టర్ పాలాక్షి, మాజీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మండలపల్లి భీమప్ప, సర్పంచులు వన్నూర్‌రెడ్డి, రామూర్తి, అతావుల్లా, జగన్, ఓబన్న, ప్రభాకర్, వివిధ విభాగాల అధ్యక్షులు ఈరన్న, నాగలక్ష్మీ, తిప్పేస్వామి, మంజునాథ్, వీరేష్, హనుమప్ప, ఈ.రాము, బొమ్మలింగ, తిప్పేస్వామి, లింగప్ప, కోఆప్షన్ ముజీ, డాక్టర్ ఈరన్న, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పార్టీ నేతలకు పిలునిచ్చారు. బుధవారం కంబదూరులో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ ఎంపీ మాట్లాడుతూ గ్రామాల్లో విబేధాలను పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలన్నారు. కొత్తగా కమిటీల్లో బాధ్యతలు చేపట్టిన వారు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, రూరల్ కన్వీనర్ హనుమంతురాయుడు, టౌన్ కన్వీనర్ వెంకటప్ప, జిల్లా కార్యదర్శి సత్తి, డాక్టర్ల విభాగం బొమ్మయ్య, జిల్లా బూత్ కార్యదర్శి నీలి శంకరప్ప, ఆర్టీఐ యాక్ట్ కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, కొఆప్షన్ మెంబర్ ఫయాజ్, నాయకులు గంగాధర్, అమర్, మీసేవ కుమార్, ఈరన్న, మల్లేష్, తలారి రమేష్, రఫీ, రాజు, విల్సన్ గోపి, రఫీ, అండేపల్లి హరి, చింతకాయల చిరంజీవి, నూతిమడుగు ఎరుకుల రమేష్, ఓబుగానిపల్లి హరిష్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడి ఉత్సవ విగ్రహ ఊరేగింపు



కూడేరు: రథంలో సాయినాథుడి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కూడేరు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం కూడేరులోని షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయినాథుడి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. భజన బృందం సాయినాథుడి పాటలను ఆలపించారు. ఆలయ కమిటీ చైర్మన్ భారతి మాట్లాడుతూ.. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. తర్వాత భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి గురుపౌర్ణమి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబు

బెళుగుప్ప: నక్కలపల్లి గ్రామంలోని షిరిడీ సాయిబాబా దేవాలయం గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. తెలంగాణ, కర్నూలు ప్రాంతాలకు చెందిన సంగీత స్వరమాధురి కళాబృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బెళుగుప్పలోని షిరిడీ సాయి ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలకు సేవా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం 6.30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులోని వేదావతి హగరి నది ఒడ్డున వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం 12.30 గంటల నంచి సాయంత్రం వరకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.

వజ్రకరూరు: స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 12 గంటలకు హారతి, నారాయణ సేవ (అన్నదానం) చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ బాలుర హాస్టల్ ఆకస్మిక తనిఖీ

శెట్టూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆర్డీఓ వసంత బాబు బుధవారం ఎంఈఓలు శ్రీధర్, వాణిదేవితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా హాస్టల్‌లో సిబ్బంది ఒక్కరూ లేపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓ వెంటనే వార్డన్ నాగరాజుతో ఫోన్‌లో మాట్లాడారు. హాస్టల్‌లో సిబ్బంది ఎవ్వరూ లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి గురువారం జరిగే మెగా పేరెంట్ మీట్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాథమిక వైద్య కేంద్రానికి వెళ్లి డాక్టర్‌తో మాట్లాడి బుధవారం పాఠశాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ ఈశ్వరమ్మ, హెచ్ఎం ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



ఆవులెన్న గ్రామంలో జలధికి తరలుతున్న పీర్లు

బెళుగుప్ప: మండల పరిధిలోని ఆవులెన్న, నరసాపురం, జీడిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం జలధి సందర్భంగా పీర్ల చావిడుల వద్ద పీర్ల స్వాములకు ముజావర్లు చదివింపులు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఎస్ఐ శివ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

శెట్టూరు: మండల కేంద్రంలోని మహాబలి రైస్ మిల్లు ప్రాంగణంలో గురువారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి తెలిపారు. ఉదయం జరిగే సమావేశానికి సమన్వయకర్త తలారి రంగయ్య హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కదం తొక్కిన కార్మికులు



రాయదుర్గంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సాక్షి నెట్‌వర్క్: కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా డిమాండ్లు పరిష్కరించాలని, కార్మిక వ్యతిరేక విధానాలపై రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోలో కార్మికులు కదంతొక్కారు. బుధవారం సీఐటీయూ ఇతర పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట కార్మికులు ధర్నా చేశారు. సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ ఇంజినీరింగ్. పారిశుధ్య, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా కార్యకర్తలు, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, భవన నిర్మాణం, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాల జోలికొస్తే మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. దేశంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేసే ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ విధానం, సమాన వేతనానికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు శాశ్వత ఉద్యోగులుగా చేయాలని, ఐసీడీఎస్ ప్రైవేటీకరణ ఆపాలని తదితర డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును కార్మికులు ఎండగట్టారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ కార్మిక సంఘం, అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, విద్యుత్ కార్మికులు, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.